
# కదలిక




లక్ష జనాభా వున్న ఆ వూరికి అలంకారంగా ఓ జూట్ మిల్లు ఉంది. మరో వారంలో పన్నెండేళ్ళొస్తాయి దానికి.

★ ★ ★

ఎలక్ట్రిక్ స్తంభం దగ్గర కొచ్చారు గోపాలరావు, నారయ్య. ఎలక్ట్రిక్ పోల్ మాత్రం ఉంది. బల్బ్ లేదు. వెన్నెల తెల్లగా మనుషుల్ని గుర్తు పట్టటానికి వీలుగా ఉంది.

"మీరిక్కడ వుండండి..... మా ఆడాళ్ళని సినిమాకి పంపేసి వస్తా...." అన్నాడు నారయ్య.

"ఇక్కడా...." అన్నాడు గోపాలరావు చుట్టూ చూస్తూ.

స్తంభం పక్కగా ఓ పాకుంది. ఆ చుట్టుపక్కల వాళ్ళకి అదే టీ కొట్టులా వుంది. గుడ్డిలైటు

కూడా లేదు.... వేసేసిన తలుపులు, ఓ చెక్కబెంచీ తప్ప.

"ఎంతసేపయ్యగారూ..... ఓ క్షణంలో వచ్చెయ్యను. ఆ బెంచీ మీద కూచోండి. అదిగో ఆ కనపడేదే మా పాక...." అని వేలుతో ముందుకి చూపించాడు నారయ్య.

వెన్నెల్లో ఆ పాకలు - గోడవునులో గుట్టలుగా పరిచిన జూట్ బేల్స్‌లా కనపడ్డాయి గోపాలరావుకి.

"సరే...." అన్నట్టు తలూపాడు.

తలూపుతూనే నారయ్య నసుగుడు చూశాడు..... చూసి ఓ రెండు రూపాయలు తీసిచ్చాడు గోపాలరావు.

అవి అందుకుని "ఇప్పుడే వచ్చేస్తా బాబుగారూ!" అని మరోసారి భరోసా చెప్పి ముందుకి నడిచాడు నారయ్య.

నారయ్య మురిక్కాలువ తూము దాటి, తొందరగా పాక్కుంటూ పోయే జీవిలాగ ఆ పాకల్లో కలిసి పోయేవరకు అటువేపు చూశాడు గోపాలరావు. తర్వాత చెక్కబెంచీ మీద కూచుందామనుకొని తెల్ల పేంటు గుర్తొచ్చి ఆగిపోయాడు.

సహజంగా అన్నిటికీ తేలిగ్గా చిరాకుపడే గోపాలరావుకి అలా నిలబడటం చిరాకనిపించలేదు.

అప్పటికే మనుషుల సందడి చాలావరకు తగ్గిపోయిందక్కడ.... రెండు మూడు గాడిదలు నెమ్మదిగా వెన్నెలని పరికిస్తున్నట్టు తూము దాటుతున్నాయి. నారయ్య తిరిగి రావటానికి కనీసం పది నిముషాలేనా పడుతుందని తెలిసినా ఏం చెయ్యటానికి తోచక అప్పట్నుంచే ఎదురు చూడటం మొదలెట్టాడు గోపాలరావు.

అయిదు నిమిషాలు గడిచేటప్పటికి కొంచెం యిబ్బందిగా అనిపించి సిగరెట్టు వెలిగించాడు. జరగబోయే తంతుని తలచుకుంటూ సిగరెట్ పొగని గట్టిగా పీల్చాడు. సిగరెట్టు పొగలోంచి ఆలోచనలోంచి వేడి వొళ్ళంతా పాకింది.

"ఎంతయినా మగాడిచాటు ఆడదంటే ఆ హుషారు వేరు" అనుకున్నాడు ముసిముసిగా నవ్వుకుంటూ.

వెంకడి పెళ్ళామనో, రంగడి పెళ్ళామనో నారయ్య అనటం గుర్తొచ్చింది గోపాలరావుకి. వాడూ తన మిల్లులోనే పని చేస్తాడని కూడా చెప్పాడు నారయ్య. అయినా వాడెవడో గుర్తు తెచ్చుకోవాలని ఎంత ప్రయత్నించినా గుర్తు రాలేదు.

అయిపోయిన సిగరెట్టు పారేస్తుంటే - వెన్నెల రొదలా దూరం నుంచి మోసుకొచ్చిన మాటలు వినపడ్డాయి గోపాలరావుకి.

తూము దాటుతూ ఎవరో యిద్దరాడాళ్ళు రావటం కనిపించింది. వాళ్ళకి పది గజాల దూరంలో నారయ్య కూడా కనిపించాడు. తూము దాటాక వాళ్ళని సాగనంపి నెమ్మదిగా వచ్చాడు గోపాలరావు దగ్గరికి నారయ్య.

"రండి బాబుగారూ! కొంచెం ఆలస్యమయింది.... ఆడమూక ఓ పట్టాన తయారయి చావరు కదండీ...." అన్నాడు.

ఆ మసక వెన్నెల్లో ముందు నడుస్తున్న నారయ్య కుడిచెయ్యి బాగా పొడుగ్గా వున్నట్టు కనపడింది గోపాలరావుకి..... నారయ్యకి ఎడం చెయ్యి లేదు. ఇంచుమించు దండవరకు ఆపరేషన్ చేసి తీసేశారు.

సన్నగా వేళ్ళాడే చొక్కా అంచులు కనిపిస్తాయి చూసేవాళ్ళకి.

జట్కా తోలుతుండగా బండి తిరగబడి చెయ్యి నజ్జయిపోయిందని కొందరంటారు. నారయ్యలాగే..... కాని యింకా కొందరు ఏదో అయినింటి ఆడాళ్ళ గొడవలో చిత్తుగా తన్నారని, ఆ తన్నడంలో చెయ్యి పచ్చడయిందని అంటారు. ఈ రెండు రకాల వార్తలు గోపాలరావూ విన్నాడు.

'పరాయిచోట తిరిగిన ఆ తల్లీ బాగా వుంది.... దాని మొగుడు..... మరోడు అందరూ బాగానే వున్నారు. వాళ్ళ కాపరాలు బాగానే వున్నాయి. మధ్యలో చెయ్యి పోగొట్టుకొన్న వాడు నారయ్యాడు. అంతే లోకం తీరు' అన్న కొందరన్న మాటా విన్నాడు.

ఎంతేనా చెయ్యి పోయాక నారయ్య జట్కా తోలడం తగ్గిపోయింది. ఒంటిచేత్తో బరువులెత్తి బండిలో పెట్టలేడు.

"ఏంటండీ.... ఉలుకూ - పలుకూ లేకుండా ఏంటో ఆలోచనలో వున్నారు" అన్నాడు నారయ్య.

"అబ్బే ఏం లేదు..." అన్నాడు. అంతగా కాకపోయినా ఆత్రుతగానే వుంది గోపాలరావుకి.

ఇద్దరూ కలిసి తూము దాటుతుంటే నల్లటి వాసన ముక్కుబద్దలు చేసింది. తూము దాటాక యిద్దరూ పాకలున్న పల్లంవేపు నడిచారు.

"ఇక్కడన్నీ పాకలే తప్ప, ఒక్క పెంకుటిల్లేనా లేదే...." అన్నాడు గోపాలరావు ఏదో వొకటి మాట్లాడాలన్న ధోరణిలో.

'ఫాక్టరీ కూలోళ్ళు, రిక్షా వాళ్ళు, బస్తాలు మోసేవాళ్ళు అందరూ ఈ బాపతే..... పెంకుటిళ్ళెక్కణ్ణించి వస్తాయి బాబుగారూ?" అన్నాడు నారయ్య.

అయిదారు పాకలు.... ఓ రెండు మలుపులు, వాడకం నీళ్ళు పోక నిలవుండి తయారయిన ఓ పిల్లకాలవ దాటాక నారయ్య పాకొచ్చింది. చూరు నీడలో తలుపుకి వేసున్న తెల్లటి తాళం మెరుస్తోంది. నెమ్మదిగా తాళం తీశాడు నారయ్య. లోపలికెళ్ళి లాంతరు గుమ్మం దాకా తీసుకొచ్చి, "లోపలికి రండి......" అన్నాడు.

లాంతరు వెలుగు పాకంతటికీ నిండుగా సరిపోటం లేదు. గుమ్మానికి దగ్గరగా పక్కేసున్న నులక మంచం, పక్కనే చాపా.... చాపకి పైగా గుడ్డ ఉయ్యాలా..... ఓ మూల కుండ..... కుండకి పైన దణ్ణెం - యిలా కొన్ని కనపడ్డాయి గోపాలరావుకి.

"కూచోండి..... దాన్నిప్పుడే పిలుచుకొస్తా...." అని నారయ్య బైటికెళ్ళాడు.

ఇదివరకెప్పుడూ యిలాటి హరికెన్ లాంతర్ల అనుభవం లేదు గోపాలరావుకి. ఎప్పుడు నారయ్య ఎవర్ని పిలుచుకొచ్చినా గోపాలరావు రూముకే తీసుకొచ్చేవాడు. లేకపోతే మరే లాడ్జి రూమో..... అక్కడ ఎలక్ట్రిక్ దీపాలే తప్ప ఈ గొడవ వుండేది కాదు. మనిషి ఫలానా అని చెపుతూ 'దానికి బైటికి రావటానికి బయమండి...' అంటూ నారయ్య తన పాక విషయం కూడా చెప్పాడు. అందుకనే పెద్ద యిబ్బందిగా లేదు గోపాలరావుకి. మరో సిగరెట్టు వెలిగించి పాక తలుపు చప్పుడు కోసం ఎదురు చూస్తూ కూచున్నాడు.

మరో సిగరెట్టున్నర టైము తర్వాత పాక తలుపు తోసిన చప్పుడు వినిపించింది గోపాలరావుకి. నారయ్య లోపలికొచ్చాడు. వెనకాల మనిషి గుమ్మం దగ్గరే ఆగిపోయింది.

"బాబుగారు...... మీరు దాన్ని సెకండ్ షో సినిమా అయే టైముకి ఓ అరగంట ముందే వొదలెయ్యాల లేకపోతే చుట్టుపక్కల దానికి లేనిపోని గొడవొస్తుంది. అదీకాక మా ఆడాళ్ళు కూడా

వస్తారు...."

నారయ్య అన్నవాటికి.... "సరే" అన్నట్టు తలూపాడు గోపాలరావు.

"ఆ టైముకి నేనొచ్చి తలుపుతటతా.... విసుక్కోకండే...." అని నవ్వి వెళ్ళిపోయాడు నారయ్య.

నిండుగా కొంగు కప్పుకునున్న తను లోపలికొచ్చి పాక తలుపు గొళ్ళెం వేసింది.

★ ★ ★

గంట గడిచేటప్పటికి ముందున్నంత ఎక్సయిటింగ్ గా అనిపించలేదు గోపాలరావుకి.... అంతా యిదివరకటిలాగే మామూలే అన్న భావన రావటం మొదలైంది. అలా అనిపించటం అంతగా నచ్చలేదు. అందుకని ఏవేనా కబుర్లలో దిగాలనుకున్నాడు.

అంతవరకూ రవణతో పెద్దగా ఏం మాట్లాడలేదు గోపాలరావు. తను తలుపు వేసొచ్చిన కాస్సేపటికి....

"పేరేమి" టన్నాడు....

"పేరెందుకు లెండి....." అంది నవ్వుతూ.

"ఫరవాలేదు, చెప్పు...." అని మరోసారి అడిగాక.

"రవణ...." అంది.

ఆ తర్వాత గడిచిన గంటలో అంత మాత్రం మాటలూ జరగలేదు. 'అటు జరుగు.... ఇటు జరుగు....' అనుకోవటం తప్ప.

ఇప్పుడు మాట్లాడాలనిపించినా, ఏం మాట్లాడటానికి తోచలేదు గోపాలరావుకి. చివరికి -

"సినిమాలు బాగా చూస్తావా...." అన్నాడు.

"ఓ!" అంది రవణ..... అని తనే చాలాసేపు వాటి గురించి మాట్లాడింది.... సినిమా హీరోల గురించి, కారులో సరసాల గురించి, సినిమా కథల్లో పేదవాళ్ళకి గబుక్కుని అదృష్టాలు రావడం గురించి....

మళ్ళీ ఉత్సాహం తెక్కుకోవాలనే ప్రయత్నంలో గోపాలరావు రవణ మాటల్ని వినీ విన్నట్టు వింటున్నాడు.

అలా వింటూనే.... 'ఇదివరకు వాళ్ళకన్నా చాలా హుషారుగా ఉంది" అనుకున్నాడు రవణ గురించి. ఆ మసక వెలుగులో ఓసారి పరీక్షగా చూశాడు. పాతికేళ్ళైనా వుండవనుకున్నాడు. రంగేమిటో సరిగ్గా తెలియకపోయినా, నలుపు కాదనుకున్నాడు.

రెండో గంట, మొదటి గంటలా కాకుండా నెమ్మదిగా గంటన్నరలా గడిచింది.

ఇంకో అరగంట గడిచాక నెమ్మదిగా తయారయ్యాడు గోపాలరావు. నారయ్య కోసం ఎదురు చూస్తూ.

"అవును..... మీ ఆయన పనిచేస్తుండగా..... నువ్వెందుకు ఇలా చెయ్యటం....." అన్నాడు.

రవణ దగ్గరగానే వుంది. నెమ్మదిగా గొణుగుతున్నట్టు చెప్పింది సమాధానం.

"ఆడబిడ్డ, మరిది, అత్తా.... అందరం కలిసి యింటికి ఏడుగురం. వాడి సంపాదన గట్టిగా తిండికే చాలదు...." అంది.... అని కాస్సేపాగి

"అదీగాక..... ఆడు రోజంతా గొడ్డులా పనిచేసి, అర్ధరాత్రి ఎప్పుడో బాగా తాగొస్తాడు. ఈ ధ్యాసే వుండదు..... ఉన్నా ఓ సరదా, సరసం వుండదు.... సంసారం చేసినట్టే వుండదు.... నేనే కాదు... యిలా

నాలా చేసే వాళ్ళు యీ పాకల్లో యింకా చాలా మందున్నారు" అంటూ యింకా చాలా విషయాలు చెప్పింది.

రవణ చేస్తున్న ఆ పని సగం డబ్బు కోసమైతే, సగం రొటీన్ జీవితం నుంచి వేరుగా ఏదో సుఖపడాలన్న తాపత్రయం అని అర్థమైనా.... అన్నింటికీ తలూపటం తప్ప ఏం సమాధానం చెప్పలేదు గోపాలరావు. రవణ చెప్పిన సినిమా కబుర్లు విన్నట్టే అవీ విన్నాడు. నారయ్య వచ్చాక బయటి కొచ్చేసి ఒక్కడూ తన ఇంటివేపు నడుస్తుంటే.... రవణ చెప్పిన మాటలు అక్కడోటి, అక్కడోటి గుర్తొచ్చాయి.

శరీరం ఎంతో సుఖం పొందినా, ఎందుకో అంత తృప్తిగా అనిపించటంలేదు. తనలో కలగాల్సిన స్పందనేదో కరువైనట్టుగా వుంది.

ఇదివరకు అలా వుండేది కాదు. మనిషికి, మనిషికి తేడా బాగా తెలిసేది. ఇలా.... ఒక ఆకారంతో కలిసి గడిపినట్టుండేది కాదు. రవణ తనతో ఎంతో దగ్గరగా గడిపింది. లోటు ఆమెది కాదని తెలుస్తోంది.

ఇదే కాదు.... ఎందుకో యింకా చాలా అనుభవాలు తనలోనే సరిగ్గా యింకటం లేదు.

ఎందుకిలా జరుగుతోంది ? తనకేమైంది ? చిరాకు.... విసుగు.... అర్థంకాని అలజడి.... తనలోనే సవ్యమైందేదో కరువవుతోంది.

తనకి సంసారం లేదు. ఏర్పరుచుకోవాలనిపించదు. పెళ్ళికి సరైన వయసంతా ఉద్యోగ తాపత్రయంతో సరిపోయింది. ఇప్పుడు వుత్సాహం లేదు.... పెళ్ళి విషయమనే కాదు.... దేన్ని గురించి స్థిరంగా ఆలోచించాలనిపించదు. అదో రకమైన మానసిక మాంద్యం.

'తనకీ చక్కటి సంసారం ఉంటే....'

అకస్మాత్తుగా యిందాకటి రవణ మాటలు గుర్తొచ్చాయి గోపాలరావుకి.

'ఆడు రోజంతా గొడ్డులా పనిచేసి బాగా తాగొస్తాడు.... సంసారం చేసినట్టే వుండదు....'

జూట్ మిల్లులో రకరకాల స్థాయిల్లో పనిచేసిన తను యిప్పుడు మేనేజర్. వర్కర్ల కష్టసుఖాలు తెలిసిన, తెలుసుకోవాల్సిన మనిషి. అయిదేళ్ళ క్రితం మిల్లులో జరిగే పనికన్నా, యీనాడు జరిగే ప్రొడక్షన్ ఎంతో ఎక్కువ. కానీ అదే మిల్లు.... అంతే వర్కర్స్.... పెరిగిన పని చాలా జీవితాల్ని, సంసారాల్ని నిస్సారం చేస్తోందంటే ఆశ్చర్యపోవాల్సిందేం లేదు.

సూటిగా రవణ చెప్పినా... ఆ విషయం తనలోకి చేరటానికి యింతసేపు పట్టింది. ఇదివరకు యిలా వుండేది కాదు. కష్టానికి, సుఖానికి గబుక్కున చలనం కలిగేది తనలో...

తనకి తెలియకుండానే తనలో మనిషితనం తగ్గిపోయినట్టనిపించింది గోపాలరావుకి మరి కాస్సేపటికి.

'తనకి సంసారం లేకపోవటమే కాదు. అసలు యిలా కాదు.. యీ జడత్వం నుంచి మనుషులకి దగ్గరగా జరగకపోతే సుఖం వుండదు....' అనుకున్నాడు.

'రవణతో తన సంబంధం ఎలాంటిదైనా కానీ... కొద్దిగంటలే అయినా.... తను అలా ప్రవర్తించ కుండా వుండాల్సింది....' అనుకున్నాడు మరి కొంతదూరం నడిచాక గోపాలరావు.

*• జ్యోతి మాసపత్రిక, డిసెంబర్ 1971*